
# సాక్షి తిరుపతి

శనివారం । 13 । జనవరి । 2024



## గంజాయి స్వాధీనం

బస్సులో అక్రమంగా తరలిస్తున్న పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు గూడూరు డీఎస్పీ తెలిపారు. - 8లో



## కండలేరు జలాల విడుదల

నెల్లూరు, తిరుపతి జిల్లా వాసుల తాగునీటి అవసరాల నిమిత్తం కండలేరు జలాలు శుక్రవారం విడుదల చేశారు. - 8లో



## రైలు ప్రారంభం

రేణిగుంట–నంద్యాల ప్రత్యేక రైలు సర్వీసును శుక్రవారం రేణిగుంట రైల్వే స్టేషన్‌లో అధికారులు ప్రారంభించారు. - 8లో

## న్యూస్‌రీల్

### అవ్వాతాతల ఆనందోత్సాహం



హర్షం వ్యక్తం చేస్తున్న పింఛన్‌దారులు

**బుచ్చినాయుడుకండ్రిగ:** ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచడంపై వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని పీవీకండ్రిగ గ్రామంలో పెంచిన రూ.3 వేల పింఛన్‌ను లబ్ధిదారులకు పంపిణీ చేశబూరు. అనంతరం అవ్వాతాతలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. సీఎం చిత్రపటాన్ని ఏర్పాటు చేసి థ్యాంక్యూ సీఎం సర్ అంటూ నినాదాలు చేశారు. మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డే రావాలని ఆకాంక్షించారు. ఎంపీటీసీ సభ్యురాలు వరలక్ష్మి, సర్పంచ్ కోటమ్మ, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్ ప్రసాద్ పాల్గొన్నారు.

### 22న ఓటర్ల తుది జాబితా



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

**తిరుపతి అర్బన్:** ఓటర్ల తుది జాబితా ఈనెల 22వ తేదీన ప్రచురిస్తామని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రాజకీయ పార్టీల నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ–2024 మేరకు జిల్లాలో అన్నిరకాల దరఖాస్తులు 4,15,234 అందగా.. అందులో 70,876 తిరస్కరించినట్టు వెల్లడించారు. మరో 695 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు రాజకీయ పార్టీల నేతలతో కలెక్టరేట్‌లో 21వ సమావేశాలు నిర్వహించినట్లు వెల్లడించారు. జీరో డోర్ నంబర్లకు సంబంధించి 519 అప్లికేషన్లు మాత్రమే సాంకేతిక కారణాలతో ఆగి ఉన్నాయని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ, బీజేపీ, టీడీపీ నేతలు చంద్రమౌళి, పురుషోత్తం నాయుడు, మనోహరాచారి, ఆర్డీవోలు నిశాంత్‌రెడ్డి, చంద్రముని, శివశంకర్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసులు, కోదండరామిరెడ్డి, తహసీల్దార్ వెంకటరమణ, ఎన్నికల సెక్షన్ తహసీల్దార్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీవారి దర్శనానికి 8 గంటలు

**తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 15 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 53,055 మంది స్వామివారిని దర్శించుకోగా 15,157 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.33 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

### 19న ఆర్టీసీ దుకాణాలకు టెండర్లు

**తిరుపతి అర్బన్:** తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో 21 ఖాళీ దుకాణాలకు ఈనెల 19వ తేదీన టెండర్లు నిర్వహించనున్నట్టు డీపీటీవో చెంగల్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పని దినాల్లో అన్ని ఆర్టీసీ డిపోల దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. 19వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట వరకు దరఖాస్తులు అందిస్తామని, అదేరోజు మధ్యాహ్నం 2 గంటల వరకు తిరుపతి డీపీటీవో కార్యాలయంలోని టెండర్ బాక్స్‌లో టెండర్లు వేయాలని సూచించారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండర్లు ఓపెన్ చేస్తామన్నారు. తిరుపతి శ్రీహరి బస్టాండ్‌లో 8 దుకాణాలు, శ్రీనివాస బస్టాండ్‌లో 6 దుకాణాలు, డీపీటీవో కమర్షియల్ కాంప్లెక్స్‌లో 7 దుకాణాలకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### 21 నుంచి రజకుల మహా పాదయాత్ర



పాదయాత్ర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

**తిరుపతి కల్చరల్:** రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరుతూ ఈ నెల 21వ తేదీ నుంచి రజకుల మహా పాదయాత్ర చేపడుతున్నట్లు జాతీయ ధోబీ మహాసంఘ్ జాతీయ అధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన రజక సంఘ నేతలతో కలిసి మహా పాదయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహా పాదయాత్రలో రజకులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రజక సంఘ నేతలు మల్లిమొగ్గలు ఉమాపతి, గంధం వెంకటముని, దాము, గంధం బాబు పాల్గొన్నారు.




# హద్దులు చెరిపేస్తూ.. ఆరోగ్యమందిస్తూ!



గుడిపాల మండలం 189 కొత్తపల్లె లో దివ్యాంగ బాలుడి ఇంటికెళ్లి పరీక్షిస్తున్న డాక్టర్ చంద్రమహేష్



189 కొత్తపల్లెలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చాలా మండలాలు పొరుగురాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక సరిహద్దులో ఉన్నాయి. ఆయా ప్రాంతాల ప్రజలు చిన్నజబ్బు చేసినా పక్క రాష్ట్రాలకు పరుగులు పెట్టేవారు. సరైన రవాణా సదుపాయాలు లేక .. ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థికంగా చితికిపోయేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆ సమస్యలన్నింటికీ చెక్ పెట్టేశారు. గ్రామీణ వైద్యాన్ని బలోపేతం చేశారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల రూపురేఖలు సమూలంగా మార్చేశారు. 24 గంటలూ వైద్య సేవలందేలా చర్యలు చేపట్టారు. దీనికితోడు నడవలేని దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులు, గర్భిణులు, ఇతరత్రా వారు పట్టణాలు.. పక్క రాష్ట్రాలకు వెళ్లే బాధలు లేకుండా ఇంటిపట్టునే వైద్యం చేసుకునేలా ఫ్యామిలీ ఫిజీషియన్ పథకానికి శ్రీకారం చుట్టారు. దీనిపై రోగులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఫ్యామిలీ ఫిజీషియన్‌తో పల్లెకు డాక్టర్లు
- పేద ప్రజలకు స్థానికంగానే వైద్యం
- ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే వారికి తగ్గిన ఆర్థిక భారం
- పక్క రాష్ట్రాలకు వెళ్లే వారికి తప్పిన తిప్పలు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

**సాక్షి, తిరుపతి డెస్క్ :** ఇంటి వద్దకే వైద్యం అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2022లో ఈ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా చేపట్టగా.. 2023 మార్చిలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. దీంతో ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఈ విధానం అమలులోకి వచ్చింది. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను కేంద్రంగా చేసుకుని 104 వాహన సేవలతో కార్యక్రమాన్ని మొదలు పెట్టింది. ఇది సత్ఫలితాలు ఇవ్వడంతో డాక్టర్లు, వైద్య సిబ్బందిని పల్లెబాట పట్టించింది. స్థానికంగానే 14 రకాల వైద్యపరీక్షలు, 67 రకాల మందులు, మాత్రలు అందిస్తోంది. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఆరోగ్యశ్రీ ఆపరేషన్ చేయించుకున్న వారి ఇంటి వద్దకే వెళ్లి వైద్యసేవలు అందించేలా చర్యలు చేపట్టింది. అంతేకాకుండా తాగునీటి శుభ్రత, అంగన్‌వాడీ సేవలు, పారిశుద్ధ్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించింది. రోజూ ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా చేపట్టే వివరాలను ప్రత్యేక యాప్‌లో పొందుపరిచేలా ఆదేశాలు జారీ చేసింది.

### నాడు ఇలా...

గత టీడీపీ హయాంలో వైద్యమంటే పేదలకు అందని ద్రాక్షలా ఉండేది. చిన్న జబ్బు చేసినా వైద్యం అందేది కాదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళితే మందులు కూడా సక్రమంగా దొరికేవి కావు. డాక్టర్లు ఎప్పుడొస్తారో.. సిబ్బంది ఎంతసేపు విధుల్లో ఉంటారో కూడా తెలిసేది కాదు. విధిలేని పరిస్థితుల్లో పేద రోగులు తీవ్ర వ్యయప్రయాసాలకోర్చి ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించేవారు. అక్కడ చికిత్స కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసి ఆర్థికంగా చితికిపోయేవారు. రవాణా ఖర్చులూ తడిసి మోపుడయ్యేవి. జిల్లా సరిహద్దు ప్రాంత వాసులైతే ఇక అంతే. పక్క రాష్ట్రాలకు పరుగులు తీయాల్సి వచ్చేది. దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులు దేవుడిపై భారమేసి మంచానికే పరిమితమయ్యేవారు.

### నేడు ఇలా...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ వచ్చాక వైద్యానికి పెద్ద పీట వేసింది. పేదల ఆస్పత్రులుగా పేరుగాంచిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల రూపురేఖలు సమూలంగా మార్చేసింది. రోగులకు కావాల్సినన్ని మందులు, మాత్రలను అందుబాటులో ఉంచింది. డాక్టర్లు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టింది. గర్భిణులకు సలహాలు, సూచనలతోపాటు ప్రసవాలు పీహెచ్‌సీలోనే జరిగేలా ఆదేశాలు జారీ చేసింది. ఆరోగ్యశ్రీ ద్వారా ఖరీదైన కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందిస్తోంది. ప్రధానంగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను నిర్మించి డాక్టర్లను పల్లెబాట పట్టించింది. ఫ్యామిలీ ఫిజీషియన్ పేరుతో కొత్తపథకానికి పురుడుపోసి పేదల నాడి పట్టింది. ఇంటి పట్టునే వైద్య సేవలు అందిస్తూ మన్ననలు అందుకుంటోంది. వలస జీవులకు, సరిహద్దు ప్రాంతాల్లోని వారికి మెరుగైన వైద్యసేవలు అందిస్తోంది. ఫలితంగా ఆర్థిక భారం తగ్గడంతోపాటు ఇంటి వద్దే వైద్యం చేయించుకునే వెసులుబాటు కల్పించింది.

### ఇంటి వద్దే వైద్యం

ఫ్యామిలీ ఫిజీషియన్ పథకం పల్లెనాడి పట్టింది. నిర్ణీత సమయంలో డాక్టర్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చేరుకుంటున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు క్లినిక్‌లోనే ఉంటూ రోగులకు సేవలందిస్తున్నారు. వృద్ధులు, గర్భిణులు, బీపీ, షుగర్ తదితర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఇతరత్రా సమస్యలున్న వారికి ఈ కార్యక్రమం అపరసంజీవినిలా మారింది. ఆర్థిక భారం, రవాణా ఖర్చులు, రోగులకు తోడుగా వచ్చే వ్యక్తి తదితర బాధలు తప్పాయి.

### వలస జీవితాలకు ఆరోగ్య భరోసా

ఉమ్మడి చిత్తూరు జిల్లా సరిహద్దుగా ఉన్న తమిళనాడు రాష్ట్రం పక్కనే గుడిపాల, చిత్తూరు రూరల్ మండలం, జీడీ నెల్లూరు, ఎస్ఆర్‌పురం, పాల స ముద్రం, నగరి, సత్యవేడు తదితర మండలాలు న్నాయి. ఈ ప్రాంత వాసులు గతంలో వైద్య సేవల కోసం తమిళనాడులోని ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లేవారు. ముఖ్యంగా వేలూరులోని ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లే వారి సంఖ్య అధికంగా ఉండేది. ఫ్యామిలీ ఫిజీ షియన్ రాకతో ఆ సంఖ్య గణనీయంగా తగ్గింది. పల్లెల్లోనే వారి బాగుగోలను పరీక్షించుకుంటున్నారు. ప్రతినెలా వైద్యపరీక్షలు చేయించుకుంటూ ఆనందంగా జీవిస్తున్నారు.

### ఫ్యామిలీ ఫిజీషియన్ వివరాలు

| | చిత్తూరు జిల్లా | తిరుపతి జిల్లా |
|---|---|---|
| విలేజ్ హెల్త్ క్లినిక్‌లు | 439 | 434 |
| 104 వాహనాలు | 34 | 31 |
| గ్రామాల సందర్శన | 495 | 501 |
| వైద్య పరీక్షలు చేసుకున్న వారు | 13,145 | 18,256 |
| జనరల్ ఓపీ | 7,123 | 8,045 |
| గర్భిణులు | 423 | 1,215 |
| బాలింతలు | 425 | 895 |
| బీపీ | 3,712 | 3,859 |
| మధుమేహం | 2,011 | 2,952 |



189 కొత్తపల్లెలో ఏర్పాటుచేసిన శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

#### మెరుగైన వైద్యం



నేను కొంత కాలంగా అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నా. కొన్నాళ్లుగా ప్రైవేటు ఆస్పత్రిలో చూపించుకుంటున్నా. అక్కడ ఇచ్చే మందులు, మాత్రలు నాకు పనిచేయలేదు. తర్వాత ఊరికొచ్చే డాక్టరు వద్ద చూపించా. మందులు, మాత్రలు ఇచ్చారు. అవి తింటున్నా. నాకు ఇప్పుడు ఎలాంటి ఇబ్బందీ లేదు. నాకు ప్రతి నెలా రూ.2 వేల వరకు మిగులుతోంది.

– అశోక్, గుడిపాల మండలం

#### సలహాలూ ఇస్తున్నారు



గర్భిణిని అని తెలిసిన రోజు నుంచి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. ఆస్పత్రికి వెళ్లకుండా పల్లె డాక్టర్ పరీక్షించి సలహాలు, సూచనలు ఇస్తున్నారు. రక్తం తక్కువగా ఉంటే పీహెచ్‌సీకి తీసుకెళ్లి ఐరన్ సుక్రోజ్ పెట్టిస్తున్నారు. బీపీ, షుగర్ చెకప్‌లు రెగ్యులర్‌గా చేస్తున్నారు. మాకు ఎలాంటి సమయం వృథా కావడం లేదు.

– నాగేశ్వరి, గుడిపాల



చిత్తూరు జిల్లా గుడిపాల మండలం 189 కొత్తపల్లెలో వైద్య సేవలందిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ చంద్రమహేష్

“

#### ఇంటికాడే చూస్తున్నారు



డాక్టరు వస్తున్నారని ముందుగానే ఆశ వర్కర్లు వచ్చి చెబుతారు. ప్రతి నెలా వారు చెప్పిన టైమ్‌కి డాక్టర్లు వస్తున్నారు. తెల్లారి నుంచి మధ్యాహ్నం దాకా ఊళ్లోనే ఉంటున్నారు. ఓపిగ్గా చూసి మంచి మందులు, మాత్రలు ఇస్తున్నారు. పరీక్షలు చేసి ఆరోగ్య వివరాలు చెబుతున్నారు. ఇప్పుడు చిన్న రోగం వచ్చినా ఇక్కడే చూపించుకుంటున్నాం.

– రాధ, గుడిపాల మండలం

#### మందులు ఇస్తున్నారు



నాకు ఒళ్లు నొప్పులు, కాళ్ల నొప్పులు అధికంగా ఉన్నాయి. ఇంకా కొన్ని సమస్యలతో బాధపడుతున్నా. ముందు ఆ ఆస్పత్రి, ఈ ఆస్పత్రి అంటూ తిరిగేదాన్ని. అప్పోసప్పో చేసి ఖర్చు చేసేదాన్ని. ఇప్పుడు ఆ బాధలేదు. ఊరికే డాక్టరు వచ్చి చూస్తున్నారు. నెలకు సరిపడా మందులు, మాత్రలు ఇస్తున్నారు.

– అంజలి, గుడిపాల మండలం

#### ఊరు వదిలి వెళ్లేది లేదు



ఏ జబ్బుకైనా పల్లెకొచ్చే డాక్టరే చూస్తున్నారు. ప్రతినెలా ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. వారిచ్చే మాత్రలు మింగుతున్నాం. అందుకే కుదురుగా ఉంటున్నాం. ఇప్పుడు ఎక్కడికీ వెళ్లేది లేదు. ఒక వేళ మాత్రలు లేకున్నా.. క్లినిక్‌కు వెళ్లి తెచ్చుకుంటున్నాం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యంతో అన్నీ బాగున్నాయి.

–జయరాజ్, గుడిపాల

#### నడిచి వెళ్లేదాన్ని



నాకు విపరీతమైన కాళ్లు నొప్పులు. నడవలేని పరిస్థితి. మూడు కాళ్లతో నడుచుకుంటూ వెళ్లి ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించుకునేదాన్ని. అక్కడిచ్చే మాత్రలు మింగుతూ వచ్చేదాన్ని. నడిచి వెళ్లాలంటే నరకం కనిపించేది. ఓ సంవత్సరంగా మా ఊరికే డాక్టరు, మందులిచ్చేవాళ్లు వస్తున్నారు. ఇప్పుడు ఎక్కడికీ వెళ్లేది లేదు. ఇంటి పట్టునే ఈడే చూపించుకుంటున్నా.

– శారద, గుడిపాల

# పేదల కోసం పుట్టిన పార్టీ వైఎస్సార్‌సీపీ

- అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగనన్న పాలన
- చంద్రబాబు పాలనలో తిరుపతి అభివృద్ధి శూన్యం
- జగనన్న పాలనలో రూ.1,700 కోట్లతో తిరుపతి అభివృద్ధి
- ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమన



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

**తిరుపతి మంగళం :** రాష్ట్రంలో పేదలకు సంక్షేమాన్ని అందించి, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు పుట్టిన పార్టీ వైఎస్సార్‌సీపీ అని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుపతి కార్పొరేషన్ పరిధిలోని 36, 37 డివిజన్లలో శుక్రవారం 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా డివిజన్లలో జగనన్న అందించిన సంక్షేమ పథకాల గురించి, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ప్రజలకు వివరించి, పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన సాగించారన్నారు. అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లల్లో ఏ నాయకుడు చేయలేనంతగా సంక్షేమ పథకాలను అందించారన్నారు. ప్రతి పేదవాడి ముంగిటకే జగనన్న సంక్షేమ పథకాలు చేరుతున్నాయన్నాయని తెలిపారు. 14ఏళ్ల బాబు పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యమని, ప్రజలకు ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా అందించకుండా మాయమాటలతో వంచించారని మండిపడ్డారు. చంద్రబాబుకు అధికార దాహం తప్ప ప్రజలకు మేలు చేయాలన్న ఆలోచన కాస్త కూడా లేదన్నారు. బాబు వస్తే జాబు వస్తుందన్న చంద్రబాబు ఏ ఒక్కరికైనా జాబు ఇప్పించారా? అని ప్రశ్నించారు. జగనన్న సచివాలయ వ్యవస్థ ద్వారా లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారని, అలాగే అనేక పరిశ్రమలను తీసుకొచ్చి నిరుద్యోగులనేదే లేకుండా చేశారన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల ద్వారా రూ.3.60 లక్షల కోట్లను పేద ప్రజలకు అందించిన గొప్ప నాయకుడు జగనన్న అని కొనియాడారు. అలాగే 3 లక్షలకు పైగా పేదల సొంతంటి కల నెరవేర్చి ఊర్లకు ఊర్లను ఏర్పరిచిన మహోన్నత వ్యక్తి జగనన్న అన్నారు. ఒక్క తిరుపతి నియోజకవర్గానికే అభివృద్ధి పనులకు కోసం రూ.1,700కోట్లు వెచ్చించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, దేవదానం, తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, కార్పొరేటర్లు గీతా, కుడితి సుబ్రమణ్యం, పార్టీ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రాయల్, మధుబాల, మద్దాలి శేఖర్, ఎన్వీ సురేష్, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## అందరి సహకారంతోనే రైల్వే ప్రయాణికుల భద్రత




భద్రత సదస్సులో రైల్వే స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ తదితరులు

**తిరుపతి(అలిపిరి):** రైల్వేలోని అన్ని విభాగాల అధికారుల సహకారంతోనే ప్రయాణికుల భద్రత సాధ్యమని.. ప్రతిఒక్క ఉద్యోగి ప్రయాణికుల సౌకర్యార్థం పనిచేయాలని స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ సూచించారు. శుక్రవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో భద్రత సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే భద్రతా దళం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.మధుసూదన్ మాట్లాడుతూ తిరుపతి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పునర్నిర్మాణ పనులను దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల భద్రత, సౌకర్యార్థం తగిన చర్యలు చేపట్టాలన్నారు. టికెట్ లేకుండా తిరుగుతూ దొంగతనాలకు పాల్పడుతున్న అనుమానితులను అరికట్టేందుకు తనిఖీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సదస్సులో రైల్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శిల్పారామంలో 'సంక్రాంతి' ఏర్పాట్లు

**తిరుచానూరు(చంద్రగిరి):** శిల్పారామంలో సంక్రాంతి వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్టు ఏఓ ఖాదర్‌వల్లీ శుక్రవారం తెలిపారు. కాకినాడ సుబ్బయ్య హోటల్ ఆర్థిక సహకారంతో 4 రోజులుపాటు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 13 నుంచి 16వ తేదీ సాయంత్రం వరకు శాస్త్రీయ నృత్యాలు, సినీ బృందాల నృత్యాలు, కామెడీ స్కిట్స్, జానపద కళారూపాల ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. 16వ తేదీ కళా ప్రదర్శనలతో పాటు గాలిపటాలు ఎగుర వేసే కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. నగర ప్రజలకు వినోదంతో పాటు ప్రత్యేక తినుబండారాల దుకాణాలు, బిర్యానీ కౌంటర్లు, 30 రకాల వివిధ అమ్యూజ్మెంట్ గేమ్స్, బోటింగ్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వినోదం పంచుతున్న శిల్పారామంను నగర ప్రజలు సందర్శించి కళాకారులను ఆదరించాలని ఆయన కోరారు.

## భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

**తిరుపతి అర్బన్:** పరిశ్రమల్లో కచ్చితంగా భద్రతా ప్రమాణాలు అమలు చేయాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 500 మందికి పైన కార్మికులు పనిచేస్తున్న 25 పరిశ్రమలను తనిఖీ చేశామని చెప్పారు. 100 నుంచి 250 మధ్య కార్మికులు ఉన్న పరిశ్రమల్లోనూ ప్రత్యేక నిఘా పెట్టాలని స్పష్టం చేశారు. సింగిల్ డెస్క్ విధానంలో ఏప్రిల్ 2023 నుంచి సెప్టెంబర్ వరకు 593 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేసినట్టు తెలిపారు. జిల్లాలో పీఎం విశ్వకర్మ యోజన పథకానికి 15,234 దరఖాస్తులు అందాయన్నారు. జిల్లా పరిశ్రమలశాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి, పొల్యూషన్ బోర్డు జిల్లా అధికారి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఆర్టీసీ క్యాలెండర్ ఆవిష్కరణ



ఆర్టీసీ ఉద్యోగుల డైరీని ఆవిష్కరిస్తున్న డీపీటీవో చెంగల్‌రెడ్డి, ఓస్వ కమిటీ నేతలు

తిరుపతి అర్బన్: ఆర్టీసీ ఉద్యోగులకు ఉపయోగకరంగా ఆఫీస్ క్యాలెండర్ ఉందని డీపీటీవో చెంగల్‌రెడ్డి కితాబిచ్చారు. తిరుపతి డీపీటీవో కార్యాలయంలో శుక్రవారం ఆర్టీసీ ఆఫీస్ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఓస్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి కేహెచ్‌రెడ్డి, సీసీఎస్ డెలిగేట్ ఈశ్వర్ రెడ్డి, ఎన్వీ బాబు హాజరయ్యారు.

# కండలేరు జలాల విడుదల



కండలేరు జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎస్ఈ

రాపూరు: నెల్లూరు, తిరుపతి జిల్లాలకు కండలేరు జలాలను విడుదల చేస్తున్నట్లు తెలుగుగంగ ఎస్ఈ హరినారాయణ రెడ్డి తెలిపారు. నెల్లూరు జిల్లా, రాపూరు మండలం, కండలేరు జలాశయం హెడ్‌రెగ్యులేటర్ సత్యసాయిగంగ కాలువ నుంచి శుక్రవారం నెల్లూరు, తిరుపతి జిల్లాలకు తాగునీటి అవసరాలకు విడుదల చేశారు. మొదటగా హెడ్‌రెగ్యులేటర్ మూడో వెంట్ ద్వారా 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కండలేరు జలాశయంలో 12 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. నెల్లూరు, తిరుపతి జిల్లాల ప్రజల దాహార్తి తీర్చేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కండలేరు నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. నెల్లూరు, తిరుపతి జిల్లాలోని వెంకటగిరి, గూడూరు, రాపూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట ప్రజల నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. సాగు నీటికి వినియోగించరాదని ఆయన సూచించారు. ఫిబ్రవరి 15 వరకు తాగు నీటిని విడుదల చేస్తామన్నారు. ఆయన వెంట కండలేరు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి, డీఈ విజయరామిరెడ్డి, ఏఈ తిరుమలయ్య ఉన్నారు.

# సఫాయి కరంచారీల సంక్షేమమే లక్ష్యం




మాట్లాడుతున్న సఫాయి కరంచారి జాతీయ కమిషన్ సభ్యులు పీపీ వవా

తిరుపతి అర్బన్: పునరావాస చట్టం 2013 ప్రకారం మాన్యువల్ స్కావెంజర్ పనులను నిషేధించాలని సఫాయి కరంచారి జాతీయ కమిషన్ సభ్యులు పీపీ వవా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఫాయి కరంచారీ జాతీయ సభ్యులు కలెక్టర్ కే. వెంకటరమణారెడ్డి, అదనపు ఎస్పీ కులశేఖర్, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికార అధికారి చెన్నయ్యలతో కలిసి మునిసిపల్ కమిషనర్లు, పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖ, ఎల్‌డీఎం తదితర శాఖల అధికారులతో పారిశుద్ధ్యకార్మికులతో చేయించే మ్యాన్యువల్ స్కావెంజర్ పనుల నిషేధంతోపాటు పునరావాస చట్టం 2013 అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యులు పీపీ వవా మాట్లాడుతూ పంచాయతీల్లో కానీ, మున్సిపాలిటీల్లో కానీ ఇతర ప్రాంతాల్లో కానీ మ్యానవల్‌గా మురుగు శుభ్రం చేసే చర్యలు చేపట్టకూడదని స్పష్టం చేశారు. సఫాయి కారంచారీల సంక్షేమమే లక్ష్యంగా కమిషన్ పనిచేస్తోందని వెల్లడించారు. సుప్రీంకోర్టు ఆదేశాల అలానే ఉన్నాయని చెప్పారు. ఆ మేరకు పలుచోట్ల సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎక్కడైనా మ్యాన్యువల్ స్కావెంజర్లు ఉన్నచో వారిని ఆ వృత్తి నుంచి బయటపడడం కోసం వారికి వన్‌టైం సెటిల్మెంట్‌గా రూ.40 వేలు అందించాలని సూచించారు. అంతేకాకుండా ఆ కుటుంబంలోని పిల్లలకు ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, స్కాలర్ షిప్, ఇల్లు లేని వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా గృహం మంజూరు చేసి, ఆసరాగా ఉండాలని ఆదేశించారు. ఆ కుటుంబంలో 18ఏళ్ల పైబడిన వారు ఉంటే స్వయం ఉపాధిపై శిక్షణ ఇప్పించి, ఉపాధి కల్పించి బ్యాంకుల ద్వారా రుణాలు అందించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే మ్యాన్యువల్ స్కావెంజర్ మరణిస్తే వారి కుటుంబానికి రూ.10 లక్షలు అందజేయాల్సి ఉంటుందని చెప్పారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి గతంలో చనిపోయిన ఇద్దరు స్కావెంజర్ల కుటుంబాలకు అందించిన సాయం తెలుపమని కోరారు. దీంతో తిరుపతి మున్సిపల్ అధికారులు ఒక్కొక్క కుటుంబానికి రూ.10 లక్షలు పరిహారం సంఘటన జరిగిన మూడు రోజుల లోపు అందజేశామని, వారి కుటుంబంలో ఒకరికి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉద్యోగం కల్పించామని కమిషన్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎలాంటి మ్యానువల్ స్కావెంజర్లు లేరని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ అమలు జిల్లాలో 95 శాతం పైగా సాధించామని చెప్పారు. అనంతరం జాతీయ సభ్యులను దుశ్శాలువాతో సత్కరించారు. తర్వాత కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన బీఆర్ అంబేడ్కర్ ఛాయా చిత్ర ప్రదర్శనను తిలకించి ఫ్లెక్సీపై సంతకాల సేకరణ చేపట్టారు. ఎస్సీ కార్పొరేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా ఈడీ నరసింహులు, ఎల్డీఎం సుభాష్ తదితరులు పాల్గొన్నారు.













### మార్కెట్‌లోకి ఎంజీ ఆస్టర్ నూతన కారు



కారును ఆవిష్కరిస్తున్న షోరూం నిర్వాహకులు

తిరుచానూరు(చంద్రగిరి): చెన్నై – బెంగళూరు రహదారి తిరుచానూరు సమీపంలోని కెశ్విన్ ఆటో మోటార్స్ షోరూంలో శుక్రవారం ఎంజీ ఆస్టర్–2024 కారును షోరూం అధినేత ఉదయ్ కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ కారును తిరుపతి, కర్నూలు, అనంతపురం, నెల్లూ రు జిల్లాల్లోని తమ బ్రాంచీల్లో ఒకేసారి మార్కెట్‌లోకి తీసుకువచ్చినట్టు తెలిపారు. వాహనం ప్రారంభ ధర రూ.9.98 లక్షలని తెలిపారు. ఇందులో ఏడీఎస్ఎస్–ఎల్–2, 49 సేఫ్టీ, అతిపెద్ద సన్‌రూఫ్, వెంటిలేటెడ్ సీట్లు, వైర్‌లెస్ చార్జింగ్ వంటి ఫీచర్లు ఉన్నట్టు పేర్కొన్నారు. సంక్రాంతి సందర్భంగా కా రు కొనుగోలుపై గోల్డ్ కాయిన్, రూ.2 లక్షల వరకు డిస్కౌంట్ ఇస్తున్నట్లు ప్రకటించారు. ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సుబ్రమణ్యం, నందాని బాషా యూబీఐ చీఫ్ మేనేజర్లు శేషసాయి, రాకేష్ పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి దృష్టికి సత్యవేడు సమస్యలు

- తిరుపతి పార్లమెంటు ఇన్‌చార్జిగా అవకాశం కల్పించడం వరంగా భావిస్తున్నా
- సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



సీఎం జగన్‌ను సత్కరిస్తున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి

పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గంలోని పలు సమస్యలను సీఎం వైఎస్.జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. శుక్రవారం ఆయన తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం జగనన్నను కలుసుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా తనకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి పార్లమెంటు సమన్వయకర్తగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపానన్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామికొలువై ఉన్న తిరుపతి పార్లమెంటు పరిధిలో వైఎస్సార్‌సీపీ తరఫున తనకు ఇన్‌చార్జిగా అవకాశం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సత్యవేడులో ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తానని ఆదిమూలం ధీమా వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సత్యవేడు నియోజకవర్గంలో పరిష్కారం కాని నాగలాపురంలోని టీపీ కోట రోడ్డు విస్తరణ, కేవీబీ పురం మండలంలోని పూడి కాజ్‌వే సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళామన్నారు. స్పందించిన సీఎం జగనన్న ఈ రెండు పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని పక్కనే ఉన్న ప్రభుత్వ సలహాదారుకు సూచించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

### పది కిలోల గంజాయి స్వాధీనం

గూడూరు రూరల్: బస్సులో అక్రమంగా తరలిస్తున్న పది కిలోల గంజాయిని శుక్రవారం గూడూరు రూరల్ సీఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో గూడూరు రూరల్, చిల్లకూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గూడూరు రూరల్ సీఐ కార్యాలయంలో డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి ఆ వివరాలు వెల్లడించారు. జాతీయ రహదారి బూదనం టోల్ ప్లాజా వద్ద శుక్రవారం వేకువ జామున తణుకు నుంచి తిరుపతికి వెళ్లే ఆర్టీసీ బస్సును తనిఖీ చేయగా అందులో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారి లగేజ్ తనిఖీ చేసినట్టు వెల్లడించారు. అందులో రెండు ప్యాకెట్లలో పది కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పార్వతీపురానికి చెందిన వాకా డి.ఈశ్వర్, రమణమ్మ(అంజలి) భార్యాభర్తలని, వీరు ఆటో నడుపుకుని జీవనం చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ క్రమంలో సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఒడిశా నుంచి గంజాయిని కొనుగోలు చేసి తిరుపతిలో విక్రయిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు వారిద్దరిపై కేసులు నమోదు చేశారు.




### సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విజయకేతనం



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ఎమరాల్డ్స్ డైరెక్టర్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని ఎమరాల్డ్స్ విద్యాసంస్థ విద్యార్థులు సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించి విజయకేతనం ఎగురవేశారని ఆ విద్యాసంస్థ డైరెక్టర్లు ఈ.గిరిధర్, కె.విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాల్లో సి.నిఖిత్ 400మార్కులకు 360, ఎస్.సౌమ్య 354, ఎన్.దివాకర్‌రెడ్డి 354, కె.ద్వారకనాథరెడ్డి 348, ఎస్.అయూబ్ 338, ఎస్.ఆరిఫుల్లా 334, బి.యోగేష్ 330 మార్కులు సాధించారని తెలిపారు. ఈ ఫలితాల్లో తమ విద్యార్థులు 91.67శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

# రేణిగుంట- నంద్యాల రైలు ప్రారంభం



జెండా ఊపి రైలును ప్రారంభిస్తున్న రైల్వే అధికారులు

రేణిగుంట : రేణిగుంట–నంద్యాల ప్రత్యేక రైలు సర్వీసును శుక్రవారం మధ్యాహ్నం రేణిగుంట రైల్వే జంక్షన్‌లో గుంతకల్ ఏడీఆర్ఎం సూర్యనారాయణ ప్రారంభించారు. నంద్యాల– కడప వరకు నడుస్తున్న డెమో రైల్వే సర్వీసును రేణిగుంట వరకు పొడిగిస్తూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి శుక్రవారం వర్చువల్ విధానంలో రాష్ట్రంలో మూడు నూతన రైలు సర్వీసులను ప్రారంభించారు. అందులో భాగంగా రేణిగంట నుంచి ఏడీఆర్ఎం జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అభ్యర్థన మేరకు స్థానికుల సౌకర్యార్థం నంద్యాల నుంచి కడప వరకు పరిమితమైన రైలు సర్వీసును రేణిగుంట వరకు పొడిగించినట్లు తెలిపారు. ఈ రైలు ప్రతిరోజూ మధ్యాహ్నం 3.45 గంటలకు రేణిగుంట నుంచి బయలుదేరుతుందన్నారు. శ్రీకాళహస్తికి చెందిన డీఆర్‌వో సభ్యుడు మురళీకృష్ణ ప్రయాణికుల సౌకర్యార్థం వీల్‌చైర్లు, టీషర్టులు, రగ్గులు పంపిణీ చేశారు.

### హాకీ చాంపియన్ తిరుపతి

- రన్నర్స్‌గా వైఎస్సార్ కడప
- ముగిసిన 14వ హాకీ ఏపీ జూనియర్ మెన్ పోటీలు



బహుమతులను ప్రదానం చేస్తున్న హాకీ సమాఖ్య ప్రతినిధి

తిరుపతి రూరల్: తిరుపతి వేదికగా మూడు రోజులు సాగిన 14వ హాకీ ఆంధ్రప్రదేశ్ జూనియర్ మెన్ పోటీల్లో తిరుపతి జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఎస్వీయూ క్రీడా మైదానంలో శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తిరుపతి జిల్లా, వైఎస్సార్ కడప జిల్లా జట్ల మధ్య పోటీ హోరాహోరీగా సాగింది. 2–1 తేడాతో వైఎస్సార్ జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల నుంచి వచ్చిన హాకీ జట్ల మధ్య పోరు ఉత్కంఠభరితంగా సాగింది. ఈ పోటీల్లో ద్వితీయ స్థానంలో వైఎస్సార్ కడప జిల్లా జట్టు నిలవగా, అన్నమయ్య జిల్లా జట్టు తృతీయ స్థానంతో సరిపెట్టుకుంది. విజేతలకు ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి హర్షవర్ధన్, చిల్లీస్ హోటల్ ప్రతినిధి రాజా బహుమతులు అందజేశారు. హాకీ పోటీలు సజావుగా సాగేందుకు రూ.50 వేలు అందజేయడంతో పాటు సహకారం అందించిన తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సహకారం అందించిన ఫ్రీడమ్ ఫ్రమ్ హంగర్ సంస్థ ప్రతినిధులు, చిల్లీస్ హోటల్ సంస్థ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. హాకీ అసోసి యేషన్ రాష్ట్ర కోశాధికారి థామస్ పీటర్, డీఎస్‌డీవో సయ్యద్ బాషా, జిల్లా హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆదిత్య రెడ్డి, ఉపాధ్యక్షుడు శశిధర్ రెడ్డి, చిల్లీస్ హోటల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఘాట్‌రోడ్డులో రెండు వేర్వేరు ప్రమాదాలు

- ఒకరి మృతి, మరో మహిళకు తీవ్ర గాయాలు



మృతురాలు దాసరి జ్యోతి

తిరుమల: తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో చోటుచేసుకున్న రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఒక మహిళ మృతిచెందగా, మరో మహిళకు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. తిరుమల ట్రాఫిక్ పోలీసుల కథనం.. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి వెనుకవైపు కొండపైన నివాసం ఉంటున్న ఏ.మ్యాదారి సంతోష్‌కుమార్, దాసరి జ్యోతిమహా (18) భార్యాభర్తలు. వీరిద్దరూ శ్రీవారి దర్శనార్థం మరో ఇద్దరితో కలిసి తిరుమలకు చేరుకున్నారు. ఆపై వీరు జీఎన్సీ టోల్‌గేట్ వద్దకు చేరుకుని ఓ ద్విచక్ర వాహనదారుడిని లిఫ్ట్ అడిగి మొదటిఘాట్ రోడ్డు మీదుగా కిందకు దిగుతున్నారు. ఈ నేపథ్యంలో ట్రిబుల్ రైడింగ్‌లో వస్తున్న వీరి వాహనాన్ని 16 మలుపు వద్ద బస్సు అధిగమించబోయింది. దీంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తాకొట్టింది. జ్యోతిమహా తలకు తీవ్రగాయాలవ్వడంతో ఆమె మృతిచెందారు. ఇదిలావుండగా మరో ప్రమాదంలో తమిళనాడుకు చెందిన భార్యాభర్తలు తిరుమల ద్విచక్ర వాహనంలో తిరుమలకు చేరుకున్నారు. అనంతరం మొదటి ఘాట్ రోడ్డు మీదుగా కిందకు దిగుతున్న సమయంలో 16 మలుపు వద్ద వాహనాన్ని అధిగమించే క్రమంలో అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో భార్య లోకేశ్వరి కాలుకు తీవ్రగాయాలయ్యాయి.

### యువకుడిపై కేసు నమోదు

రేణిగుంట : గాజులమండ్యం పంచాయతీ నీలిశానిపేటకు చెందిన ఓ యువతిని అదే గ్రామానికి చెందిన విశ్వసాయి(22) ప్రేమించాలని వేధించాడు. యువతి ఫిర్యాదు మేరకు రేణిగుంట రూరల్ సీఐ సుబ్బరాయుడు కేసు నమోదు చేసి పరారీలో ఉన్న యువకుడి కోసం గాలిస్తున్నారు.